క్లుప్తంగా

వన్య ప్రాణులకు హాని తలపెట్టొద్దు



నర్సాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రుద్రవరం: వన్య ప్రాణులకు ఎలాంటి హాని తలపెట్టవద్దని రుద్రవరం రేంజి అధికారి ముర్తుజావలి కోరారు. సబ్ డీఎఫ్ఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో రేంజి అధికారి వన్యప్రాణి వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా శుక్రవారం అటవీ ఉద్యోగులతో నర్సాపురంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా నిలిచి వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఎఫ్ఎస్ఓలు ముఖ్తార్ బాషా, రాణెమ్మ, రామక్రిష్ణ, జేమ్స్‌పాల్, ఎఫ్‌బీఓలు వుశేన్‌బాషా ఉన్నారు.

రజక సంఘం అభివృద్ధికి కృషి

గోస్పాడు: రజక సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. మండలంలోని యాళ్లూరు గ్రామానికి చెందిన రజక సుబ్రహ్మణ్యం పార్టీ రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమించబడ్డారు. దీంతో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు బెక్కెం రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు.

బాబులాల్ ఎంపికపై హర్షం



సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

చాగలమర్రి: మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్.బాబులాల్‌ను పార్టీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించడంపై మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, వ్యాపార వేత్త చక్రం ముల్లా షేక్.షబ్బీర్ అహ్మద్, ఉప సర్పంచ్ షేక్ మహమ్మద్ సోహెల్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డికి, మాజీఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్.షబ్బీర్ బాషా, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, యువజన విభాగం అధ్యక్షుడు వి.షరీఫ్, కార్యకర్తలు గేట్ల మాబుసాబు, ఫ్రూట్ షేక్షావలి, శ్రీనివాసులు, రమణారెడ్డి, చాంద్ బాషా, దామోదరుడు పాల్గొన్నారు.

వ్యక్తిపై కట్టెలతో దాడి

ఉయ్యాలవాడ : మండలంలోని కొండుపల్లె గ్రామంలో వ్యక్తిపై కట్టెతో కొట్టి గాయపరచిన ఘటనలో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన తోట నరసింహుడు తన గృహం వద్ద ద్విచక్ర వాహనాన్ని నీటితో శుభ్రపరచగా.. ఆ నీరు పక్కనున్న గృహాల వైపు వెళ్లింది. దీంతో హైదర్‌వలి, మహమ్మద్ వలి, ఖాసీంలు వాగ్వాదానికి దిగారు. మాట మాట పెరిగి ముగ్గురు కలిసి నరసింహుడు తలపై కట్టెలతో దాడి చేయగా గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.


వైద్య సేవల తనిఖీ

శిరివెళ్ల: డాక్టర్ల సమ్మెతో వైద్య సేవల కొనసాగింపుపై తనిఖీలు చేస్తున్నామని డీఎం అండ్‌హెచ్ఓ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. సమ్మెతో వైద్య సేవలపై సిబ్బందితో ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ.. సమ్మెతో సామాన్య ప్రజలకు వైద్య సేవలపై తాము ఆరా తీస్తున్నామన్నారు. అత్యసర కేసులుంటే జిల్లా వైద్యశాలకు రెఫర్ చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

రుద్రవరం: మండల పరిధిలోని చిత్రేనిపల్లెలో మౌలాలిస్వామి, దస్తగిరి స్వామి, చిన్నకంబలూరులో పెద్ద కాశీం, చిన్న కాశీం పీర్లకు శుక్రవారం రాత్రి జియారత్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొహర్రం వేడుకలు ముగిసిన మూడు నెలలలోపు జియారత్ వేడుకలు నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లోని చావిళ్లలో పీర్లను దట్టీలు, పూల సూచికాలు, వెండి గొడుగులతో ప్రత్యేకంగా అలంకరించి కొలువుదీర్చారు. అనంతరం పీర్లకు గ్రామోత్సవం నిర్వహించారు.

జమ్ము పొదల్లో జింక



పోలీస్‌స్టేషన్‌లో జింక

ఉయ్యాలవాడ : మండలకేంద్రం సమీపంలోని వాగులో గురువారం ఒక జింకను స్థానికులు గుర్తించారు. జింకను కుక్కలు తరుముతుండగా అది పరిగెత్తుకుంటూ వచ్చి వాగు జమ్ము పొదల్లో ఇరుక్కుపోయింది. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి జింకను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు.



ప్రత్యేక అలంకారంలో శ్రీకాళికాంబదేవి, శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, కోటా సుంకులాపరమేశ్వరి అమ్మవారు, బైటిపేట ఆంజనేయస్వామి,విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి,బంగారు చీరలో వాసవీ మాత, శ్రీకాశిరెడ్డినాయన ఉత్సవమూర్తికి గ్రామోత్సవం

వైభవంగా దసరా వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో గురువారం విజయ దశమి పండుగ వేడుకలను భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. పండుగ రోజు ఉదయమే పలు దేవాలయాలను పుష్పాలతో పాటు మూలమూర్తులు, ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అమ్మవార్లను రాజరాజేశ్వరిదేవిగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మెయిన్‌బజార్‌లోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు దేవాలయాల్లో సాయంత్రం శమీ దర్శనం కోసం భక్తులకు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. జమ్మి పత్రిను పిల్లలు పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు పొందారు. ఒకరినొకరు ఇచ్చిపుచ్చుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సాయంత్రం పట్టణంలోని అమ్మవారిశాల పీఠం, కాళికాంబదేవి పీఠం, శ్రీ కామేశ్వరిదేవి సహిత మహానందీశ్వర్లు, బ్రహ్మానందీశ్వరుల పీఠం, జగజ్జననీ దేవాలయాల, శ్రీకాశిరెడ్డినాయన ఆశ్రమం పీఠాలకు గ్రామోత్సవం జరిపించారు. గ్రామోత్సవం గాంధీచౌక్, కల్పనాసెంటర్, కొత్త మసీదు, బైటిపేట ఆంజనేయస్వామి, బంగారు అంగళ్ల మీదుగా సాగింది. శ్రీకామేశ్వరిదేవి సహిత మహానందీశ్వరస్వామి



గ్రామోత్సవంలో దేవాలయాల ఉత్సవమూర్తులు,శమీవృక్షాన్ని దర్శించుకుంటున్న భక్తులు

శుక్రవారం ఉదయం శరన్నవరాత్రి ఉత్సవాలు ముగించుకొని మహానందికి బయల్దేరారు.

అలరించిన దసరా వేషాలు

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు దసరా వేషాలు అలరించాయి. ఏటా ఆనవాయితీగా భద్రకాళి, శక్తి, మహిషాసురుడు, శివుడు, నాగకన్యలు, దున్నపోతు, రక్తబీజుడు తదితర వేషాలంకరణలో తప్పెట్ల మధ్య వీధుల్లో అలరిస్తూ ఒక్కో వేషం అమ్మవారిని కీర్తిస్తూ చెడుపై విజయం సాధిస్తూ అమ్మవార్లు రాక్షసులను వధించే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. స్థానిక బైటిపేట, ఉప్పరిపేట, దేవనగర్, పీవీనగర్, గుడిపాటి గడ్డ, తెలుగుపేట యువకులు గ్రూపులుగా దసరా వేషాలు వేసి ప్రత్యేకను చాటుకున్నారు. నంద్యాల కమ్యూనికేషన్ కళారాధన ఆధ్వర్యంలో టౌన్‌హాల్‌లో నంద్యాల స్మార్ట్ సిటీ సమన్వయంతో ఆర్టీసీ బస్టాండ్ వద్ద విక్టోరియా రీడింగ్ రూం, ఇండోర్ స్టేడియం, గుడిపాటిగడ్డ యూత్ ఆధ్వర్యంలో దసరా వేషాల పోటీలు జరిపించారు. ప్రథమ బహుమతిగా రూ. 40వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు అందజేశారు. గుడిపాటి గడ్డలో కౌన్సిలర్ దండె లక్ష్మిదేవి, సుధాకర్, కో ఆప్షన్ మెంబర్ పడకండ్ల సుబ్రమణ్యం, చందు, సుబ్బయ్య, గుడిపాటి ప్రసాద్ పాల్గొన్నారు.



వివిధ వేషాల్లో కళాకారులు, యాళ్లూరులో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళ్తున్న దృశ్యం

గోస్పాడు: దసరా పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని గ్రామాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పండుగ వేడుకలను గురు, శుక్రవారాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాటు చేసిన అమ్మవారికి పండుగరోజు గ్రామస్తులు బోనాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. గోస్పాడు, పసురుపాడు,జూలేపల్లె, యాళ్లూరు, సత్యనారాయణపురం, ఎం.క్రిష్టాపురం గ్రామాల్లో దుర్గమ్మజ అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి నవరాత్రుల కార్యక్రమాలను చేపట్టారు. గురువారం గోస్పాడు, పసురుపాడు,జూలేపలెలో, శుక్రవారం యాళ్లూరు, సత్యనారాయణపురం, ఎం.క్రిష్టాపురం గ్రామాలలో అమ్మవారి విగ్రహాలకు నిమజ్జన మహోత్సవం నిర్వహించారు. గ్రామాలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా ఎస్ఐ సుదాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



చిన్నచెరువు కట్ట వద్ద అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాలు, వీధుల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలను శుక్రవారం భక్తి శ్రద్ధలతో స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద గల వినాయక ఘాట్‌లో నిమజ్జనం చేశారు. 13వ రోజు ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. పట్టణంలో దాదాపు 20 విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆళ్లగడ్డలో అమ్మవార్ల అలంకరణలో చిన్నారులు, ఉయ్యాలవాడలో ఉత్సవ మూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం, చాగలమర్రిలో..

ఆళ్లగడ్డ : విజయదశిమి సందర్భంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు పట్టణంలోని అమ్మవారిశాలలో కొలువైన శ్రీ వాసవీ దేవి అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

- దొర్నిపాడు: నవరాత్రుల్లో భాగంగా చివరి రోజు గురువారం అమ్మవారు విజయలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. శుక్రవారం వసంతోత్సవం నిర్వహించి ఒకరికొకరు రంగులు జల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.
- ఉయ్యాలవాడ : దసరా పండుగ సందర్భంగా ఉయ్యాలవాడలో అగస్త్యేశ్వర, కోదండ రామస్వామి, రామాలయం ఆలయాల్లో వెలిసిన సీతారాములు, శివపార్వతుల ఉత్సవమూర్తులను ప్రత్యేక పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని శమీ వృక్షం(జమ్మి చెట్టు) వద్దకు ఉత్సవమూర్తులకు మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లారు. వేద పండితులు జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

చాగలమర్రి: విజయదశమిని సందర్భంగా చాగలమర్రిలోని గ్రామదేవత చాగలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన చాగలమర్రిలోని శ్రీకన్యాకాపరమేశ్వరిదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం వంసతోత్సవ కార్యక్రమంతో ఘనంగా ముగిశాయి. శ్రీచెన్నకెశవ స్వామి ఆలయంలో అమ్మవారు శ్రీవిజయలక్ష్మీదేవి ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం అమ్మవారిని పల్లకీపై గ్రామ పోలిమేరలో ఉన్న శ్రీబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలోని జమ్మిచెట్టు వద్దకు తీసుకెళ్లి శమీదర్శనం కార్యక్రమం నిర్వహించారు. రాత్రి అమ్మవారు, చెన్నకెశవ స్వామికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. వసంతోత్సవంలో ఆర్యవైశ్య యువకులు రంగుల చల్లుకోని పండుగను సంతోషం జరుపుకున్నారు.



దొర్నిపాడులో విజయలక్ష్మిదేవిగా అమ్మవారు, వసంతోత్సవం సందర్భంగా పల్లకీలో ఊరేగిస్తున్న అమ్మవారు

ముత్యాలపాడులో

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో విజయదశమి రోజు రాత్రి అమ్మవారు శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం సాయంత్రం అమ్మవారిని పల్లకీపై కొలువుంచి ఊరేగింపుగా స్థానిక శ్రీవరభేశ్వరస్వామి, శ్రీమూర్తి లక్ష్మీ నరసింహ్మాస్వామి ఆలయాల వద్ద ఉన్న జమ్మివృక్షం వద్దకు తీసుకెళ్లి శమీదర్శనం చేయించారు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి పల్లకీలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శ్రీకన్యకా పరిమేశ్వరిదేవి పొన్ను సేవ కార్యక్రమంతో విజయదశమి వేడుకలు ముగిశాయి.

అహోబిలంలో ముగిసిన దసరా మహోత్సవాలు



శ్రీ ప్రహ్లాదవరదుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ : ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో దేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు గురువారంతో వైభవంగా ముగిశాయి. ఉదయం దిగువ అహోబిలం దేవాలయ ప్రాంగణంలోని యాగ శాలలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి సుప్రభాత సేవ చేపట్టి ప్రత్యేక విజయదశమి పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు నవకలశ పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించి నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తులకు విశేష ఆభరణాలు ధరించి విశేష పుష్పాలంకరణ గావించిన ఊయలలో విడివిడిగా కొలువుంచి మహావీర్ నివేదన, లక్ష కుంభహారతి నీరాజనములు సమర్పించి దివ్యప్రబంధ పారాయణాలు నిర్వహించారు.

శాస్త్రోక్తంగా శమీ మహోత్సవం

శరన్నవరాత్రి మహోత్సవాల్లో చివరిరోజైన విజయదశమి రోజు నిర్వహించే శమీ వృక్ష మహోత్సవానికి ప్రత్యేకస్థానం. ఇందులో భాగంగా దిగువ రాత్రి ఉభయ దేవేరులతో శ్రీ ప్రహ్లాదవరదుడు ప్రత్యేకంగా విశేష పష్పాలంకరణ గావించిన ఉత్సవ పల్లకీని మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ గ్రామ శివారులోని జమ్మి చెట్టు వద్దకు చేరకున్నాడు. అక్కడ సంప్రదాయ ప్రకారం ఆయుధ పూజ నిర్వహించిన అనంతరం స్వామి వారి తరుపున అర్చకులు విల్లంబులను వదిలి సంబరాలు జరుపుకున్నారు. నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్వామి, అమ్మవారు వెళ్లే వనమహోత్సవంలో పాల్గొనేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.

ఘనంగా గాంధీ జయంతి

నంద్యాల(అర్బన్): జాతిపిత మహాత్మాగాంధీ 156వ జయంతితో పాటు మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని నంద్యాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ పట్టణ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులుతో పాటు పార్టీ నాయకులు స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పబ్బతి అబ్రహాం, సలాం, అమీద్, మస్తాన్ పాల్గొన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, కార్యదర్శి మేకల లింగస్వామి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ గఫార్, తోటరాజగోపాల్, కాంశీవలి, శివన్న పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేంద్రప్ప, ఉపాధ్యక్షులు ఫకృద్దీన్, కోశాధికారి శ్రీనివాసులు, ఏసురత్నం, బుల్లెట్ బాషా, రాముడు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

నంద్యాల(వ్యవసాయం): ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు కండే శ్యాంసుందర్‌లాల్, అధ్యక్షుడు బింగుమల్ల శ్యాం ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నెరవాటి రవి, అనిల్, జనార్ధన్, నాగరాజు, ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): స్థానిక నందమూరినగర్‌లో ఉన్న నేతాజీ సుబాష్ చంద్రబోస్ ఆవాసియ విద్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి నిర్వహించారు. రాష్ట్ర గిరిజన సమాఖ్య కార్యదర్శి రాజేశ్వరమ్మ, స్టార్ సొసైటీ ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, నాగలక్ష్మి, సౌజన్య, కమాల్ బీ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): మహాత్మాగాంధీ ఆశయ సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వై.రామపక్కీర్‌రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరెడ్డి కోరారు. గురువారం స్థానిక పీఆర్‌టీయూ కార్యాలయంలో జాతి పిత మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణంలోని గాంధీచౌక్ వద్దకు వెళ్లి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేస్, సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాహీర్ హుసేన్ ఆధ్వర్యంలో ఎంపీపీ వీరభద్రుడు గాంధీజీ, లాల్‌బహుదుర్ శాస్త్రీల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు లక్ష్మీనారాయణ స్థానిక గాంధీ సెంటర్‌లోని విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోవిందయ్య, ఏఓ రాజేంద్రప్రసాద్, ఏపీఓ నిర్మల, ధర్మకర్త వి.అక్మణ బాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం... ఉగ్రనృసింహుడి పవిత్రోత్సవం

ఆళ్లగడ్డ : ఎగువ అహోబిలం శ్రీజ్వాలనృసింహస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున నిత్య పూజల అనంతరం మూలవిరాట్ శ్రీ జ్వాలనృసింహస్వామి, చెంచులక్ష్మి అమ్మవార్లకు పవిత్ర మాలలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులైన జ్వాలనరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను యాగశాలలో కొలువుంచి నవకలశ స్నపనం, ద్వారతోరణ పూజ, మండల ప్రతిష్ట, కుంభ ప్రతిష్ట నిర్వహించారు. అనంతరం వేద పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య పవిత్ర హోమం చేపట్టారు. రాత్రి ఉభయదేవేరులతో ఉగ్రనరసింహస్వామి విశేష పుష్పాలంకరణ గావించిన అనంతరం ఉత్సవ పల్లకీని అధిష్టించి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు.

నేత్రపర్వంగా స్నపన తిరుమంజనం

పవిత్రోత్సవాల్లో భాగంగా ఉత్సవ మూర్తులను కొలువుంచి వేద మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా కొనసాగింది. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనం, గంధంతో పండితులు వేధఘోశణల ఘధ్య స్వామి, అమ్మవార్లకు స్నపన



పవిత్ర హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

తిరుమంజనం నిర్వహించారు. అనంతరం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు హోమం నిర్వహించి మంగళ హారతీ, తీర్థప్రసాద గోష్టి వితరణతో మొదటి రోజు కార్యక్రమాన్ని ముగించారు.

పవిత్రోత్సవ విశిష్టత

ఏడాది పొడవునా ఆలయంలో నిర్వహించే నిత్యకైంకర్యాలు, వార, మాస, వార్షిక ఉత్సవాలు, ఇతరత్రా పూజాధి కార్యక్రమాల్లో తెలిసీతెలియక చేసిన తప్పుల వల్ల ఏర్పడ్డ దోష నివారణకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ.

మత్స్య రంగానికి ఊరట

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో మత్స్య రంగానికి ఊరట లభించినట్లయ్యిందని జిల్లా మత్స్యశాఖ అధికారి హీరానాయక్ తెలిపారు. ఆక్వా రంగంలో సుస్థిరత సాధించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నంద్యాల మండలం అయ్యలూరు ఆక్వా క్లస్టర్ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం సూపర్ జీఎస్‌టీ-సూపర్ సేవింగ్స్‌పై మత్స్యకారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని నాలుగు శ్లాబ్‌ల నుంచి రెండు శ్లాబ్‌లకు తగ్గించిందన్నారు. మత్స్య రంగంలో 12, 18 శాతం ఉన్న జీఎస్టీ 5 శాతానికి తగ్గించిందన్నారు. వాణిజ్య పంటల శాఖ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీనాయక్, చందన హర్ష, సునీత రెడ్డి, ఏసీటీఓ అబ్దుల్‌రసీద్, మత్స్య అభివృద్ధి అధికారులు పామన్న, విజయరాజు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో ఏఓ సుమతి శుక్రవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు వినియోగించే వ్యవసాయ ఉప కరణాలు, సామగ్రిపై ప్రభుత్వం జీఎస్టీ రేట్లను తగ్గించిందన్నారు. ట్రాక్టర్లు, డీజిల్ ఇంజన్లు, టైర్లు, విడి భాగాలపై ఉన్న 18శాతంలో నుంచి 5 శాతం పన్ను తగ్గించిందన్నారు. అలాగే స్ప్రింక్లర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, చేతి పంపులు వంటి వాటిపై ఉన్న 12 శాతం పన్నులో నుంచి 5 శాతంలోకి తీసుకొచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ అధికారి దస్తగిరి, పీఆర్ఏఈ కమాల్ తదితరులు ఉన్నారు.

నేడు ఆటో డ్రైవర్ల ఖాతాల్లోకి నిధుల జమ

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.15వేలు చొప్పున శనివారం జమ చేస్తుందని నంద్యాల జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 10,006 మంది ఆటో డ్రైవర్లకు రూ.15.09 కోట్లు జమ చేయనుందన్నారు. స్థానిక మున్సిపల్ టౌన్‌హాల్‌లో కార్యక్రమాన్ని నపిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేషన్ దుకాణాల్లో 'విజిలెన్స్' తనిఖీలు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని రేషన్ దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ అధికారులు శుక్రవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. రేషన్ దుకాణాలకు అందిన నిత్యావసర సరుకుల స్టాక్‌లో తేడాలు ఉన్నాయనే ఫిర్యాదు మేరకు విజిలెన్స్ సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో నంద్యాల మండలం చాపిరేవుల గ్రామంలో ఓ చౌక దుకాణంతో పాటు పట్టణంలోని జ్ఞానాపురంలోని 77 రేషన్ షాపు, ఎన్‌జీఓస్ కాలనీలోని 115 రేషన్ షాపుల్లో తనిఖీలు చేశారు. మూడు దుకాణాల్లో స్టాక్ నిల్వల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించి స్టాక్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేశారు. చర్యల నిమిత్తం స్థానిక రెవెన్యూ అధికారులకు నివేదించారు. ఆర్ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర ఉన్నారు.